అభివృద్ధి పనులను వేగవంతం చేయండి


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమై నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక మట్టిని వెలికి తీయించాలని సూచించారు. కొన్ని రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్‌ను కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారికి వివరించామని ఎమ్మెల్యే తెలిపారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నిర్మించిన ఎస్‌ఎన్‌డీపీ, బాక్స్ డ్రెయిన్, ట్రంక్ లైన్స్ నిర్మాణ పనులు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. నూతన రోడ్లు, డ్రైన్స్ నిర్మాణ పనుల్లో భాగంగా ఎత్తుపల్లాలు సరిగ్గా చూసుకొని పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు,దామోదర్ రెడ్డి,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం


హోమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ తదితరులు

చంపాపేట: అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామి ఆలయంలో గణపతి హోమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు భార్గవ శర్మ మాట్లాడుతూ.. సంకష్టహర చతుర్థి మంగళవారం రావడంతో అంగారక చతుర్థిగా మారటంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. అంగారక సంకష్టహర చతుర్థి రోజున గణపతిని పూజించుకునే వారికి కుజ దోషం, రుణ, శతృ బాధలు తొలగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు సురేష్, ఆనంద్‌గౌడ్, మధుసూదన్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, వేద పండితులు చంద్రకాంత్ శర్మ, అర్చకులు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి


హస్తినాపురంలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల గురించి ఆయా కాలనీల ప్రతినిధులతో కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని ప్రణాళికాబద్ధంగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానా కాలంలో సమస్యలు రాకుండా..

- మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు
- మూతల ఏర్పాటు
- ప్రమాదకరంగా ఉన్న చోట గ్రిల్స్ ఏర్పాటు
- తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వాటర్ వర్క్స్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



ఎల్బీనగర్ పరిధిలో మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన గ్రిల్స్, మ్యాన్‌హోళ్లపై ఎరుపు రంగుతో హెచ్చరిక



ఎల్‌బీనగర్: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నామని ఎల్‌బీనగర్ జలమండలి 10 బీ జీఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మురుగు, మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన పేర్కొన్నారు.

ప్రశ్న: ఎల్‌బీనగర్ జలమండలి పరిధిలో ఎన్ని మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వాటిలో లోతైనవి ఎన్ని ఉన్నాయి.?

జవాబు: ఎల్‌బీనగర్ జలమడలి 10బీలో మొత్తం 27,144 మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వీటిలో లోతైన మ్యాన్‌హోళ్లు 1692 ఉన్నాయి.

ప్రశ్న: ఎన్ని ప్రమాదకర మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వాటి వద్ద ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: సర్కిల్‌లో మొత్తం 1692 ప్రమాదకర మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వాటిపై గ్రీల్స్ ఏర్పాటు చేయడంతో పాటు అతి ఎక్కువ ప్రమాదకర మ్యాన్‌హోళ్ల వద్ద ఎర్ర రంగు వేయడంతో పాటు హెచ్చరికలు ఏర్పాటు చేశాం. ప్రజలెవ్వరూ మ్యాన్‌హోళ్లను ఓపెన్ చేయరాదు.

ప్రశ్న: ఎల్‌బీనగర్‌లో మొత్తం ఎన్ని కిలో మీటర్ల డ్రైనేజీ లైన్ ఉంది?

జవాబు: సుమారు 449.475 కిలో మీటర్ల డ్రైనేజీ లైన్ ఉంది. ఇంక కొన్ని కాలనీల్లో డ్రైనేజీ సమ స్య ఉంది. అక్కడ కూడా పైప్‌లైన్ ని ర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: పలు కాలనీల్లో నిత్యం డ్రైనేజీ మ్యాన్ హోళ్లు పొంగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మ్యాన్‌హోళ్లు ఎక్కడ పొంగినా వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెలా 200 మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టి, మూతలు లేని మ్యాన్‌హోళ్లపై మూతలు ఏర్పాటు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ప్రతి నెలా మరమ్మతులకు ఎంత ఖర్చు చేస్తున్నారు?

జవాబు: ప్రతి నెలా వాటర్ పైప్‌లైన్ల మరమ్మతులకు సుమారు రూ.30 లక్షలు, డ్రైనేజీ మరమ్మతులకు సుమారు రూ.40 లక్షలు ఖర్చు అవుతున్నాయి. ఎక్కడ ఇబ్బంది ఉన్నా వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: 10బి పరిధిలో ఎన్ని నీరు నిలిచే ప్రాంతాలు ఉన్నాయి, వాటిపై మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

జవాబు: 10బీ పరిధిలో పలు ప్రాంతాల్లో చిన్న చిన్న నీరు నిలిచే ప్రాంతాలు ఉన్నా దానిలో ప్రధానంగా 5 చోట్ల ప్రమాదకరంగా నీరు నిలుస్తోంది. అందులో సీతార హోటల్ వద్ద, గణేష్‌నగర్ ఈవ్య ఆసుపత్రి,ఆగమయ్యనగర్, బండ్లగూడ అయ్యప్ప కాలనీ, విజయపురి కాలనీలు ఉన్నాయి. ఆ ప్రాంతాలలో వర్షాల సమయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: డ్రైనేజీ మరమ్మతులకు ఎన్ని గల్పర్లు, బకెట్ యంత్రాలు ఉన్నాయి?

జవాబు: డ్రైనేజీ మరమ్మతులు కోసం మొత్తం 5 గల్పర్లు, 3 పెద్ద బకెట్లు, 2 చిన్న బకెట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం కాలనీలో పొంగే డ్రైనేజీని క్లియర్ చేస్తున్నాం.

ప్రశ్న: నెలకు ఎన్ని బిల్లులు వసూలవుతున్నాయి. వాటిలో నీటి బకాయిలు ఎన్ని. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పరిధిలో మొత్తం రూ. 20.26 కోట్లు వసూలు అవుతుండగా దానిలో రూ.1.32 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఉచిత నీటి కింద ప్రతి నెలా రూ.1.21కోట్లు రాయితీ ఇస్తున్నాం.

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని వాటర్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో రాయితీ కనెక్షన్లు ఎన్ని?

జవాబు: మొత్తం 40 వేల వాటర్ కనెక్షన్లు ఉండగా, దానిలో 18,500ల కనెక్షన్లకు రాయితీ ఇస్తున్నాం. మా పరిధిలో మొత్తం 14.5 ఎంజీడీ నీరు సరఫరా అవుతోంది. నీటి బకాయిలు చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఘనంగా బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో పారాయణం చేస్తున్న మహిళలు

చైతన్యపురి: గడ్డిఅన్నవరం క్షేత్ర సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం సుదర్శన హోమం, కొండూరి పద్మావతి ఆధ్వర్యంలో మహిళలు పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వూర నర్సింహగుప్తా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, బచ్చు సత్యనారాయణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, సలహాదారు నాగేందర్, కుమారస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ నాయకులు

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఫతుల్లాగూడ సాయి సుప్రభాత్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, కాలనీలో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. మంగళవారం వారు బీఆర్‌ఎస్ పార్టీ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, కాటేపాక రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సూర్యనారాయణ, సోమలియా, స్వాతి ఠాకూర్, అమ్రాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

నాగోలు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయాలని కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఎల్‌బీనగర్ బీసీ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకుడు పెద్దవూర బ్రహ్మయ్య మంగళవారం ఓ ప్రకటనతో హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాలుగా రుణమాఫీ విడుదల చేయడం వల్ల అవి వడ్డీకే సరిపోయిందన్నారు. రైతు పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీ ఒకే దఫాగా రూ.2 లక్షల రుణ మాఫీ అమలు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

దేశం ఎప్పటికీ మర్చిపోని రోజు..



ఎమర్జెన్సీ సమయంలో హింసకు గురైన మిసా ఖైదీలను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: 25 జూన్ 1975 ప్రజాస్వామ్యానికి చీకటి రోజని, దేశం ఎప్పటికీ మరచిపోలేని...ఎప్పటికీ క్షమించని రోజని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం ఆ పార్టీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ అధ్యక్షతన ఎమర్జెన్సీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ, బీజేపీ ఎక్కడ కూడా రాజ్యాంగాన్ని మారుస్తామనే చెప్పలేదన్నారు. అయినప్పటికీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు తొలగిస్తారని ఇండియా కూటమి నేతలు దుష్ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని దేశమంతా విషప్రచారం చేసినా.. దేశ ప్రజలు మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా నిలిచారన్నారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ దేశంలో 21 నెలల పాటు కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీని విధించారని విమర్శించారు. నాటి చీకటి రోజులు దేశ యువతకు, ప్రజలకు తెలియజెప్పాలనే ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆనాడు హింసకు గురైన మిసా (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్) ఖైదీలను శాలువాలతో సత్కరించారు. అనంతరం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, నర్సింహా గుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, నాయకులు గీతా రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, గంగదాసు కృష్ణారెడ్డి, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ ఎమర్జెన్సీ


సుభాష్‌చందర్జీని సన్మానించిన ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

సైదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ లాంటిదని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ అన్నారు. సైదాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడైన సుభాష్‌చందర్జీ ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ కాబడి జైలు జీవితం గడిపారు. ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదీన బీజేపీ నాయకులు యాంటీ ఎమర్జెన్సీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం సైదాబాద్‌లోని సుభాష్ చందర్జీ నివాసానికి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్ పార్టీ నాయకులతో కలిసి వచ్చి ఆయనను శాలువాతో కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సుభాష్‌చందర్జీ ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు.

విద్యాశాఖకు మంత్రిని వెంటనే నియమించాలి


ఎల్‌బీనగర్‌లో విద్యా దీక్ష చేస్తున్న చామకూర రాజు తదితరులు

విద్యాదీక్షలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు రాజు డిమాండ్

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్ మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మంగళవారం ఆయన విద్యాదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని, కార్పొరేట్ విద్యా సంస్థలను కట్టడి చేయాలని కోరారు. గురుకుల విద్యసంస్థల ఇంటిగ్రేటెడ్ పద్ధతిని పైలట్ ప్రాజెక్టుగా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అమలు చేయాలన్నారు. దీక్షకు పలువురు రాజకీయ, సామాజికవేత్తలు హాజరై మద్దతు పలికారు. కార్యక్రమంలో తెలంగాణ డెమొక్రటిక్ జేఏసీ చైర్మన్ కొల జనార్ధన్, సోషల్ జస్టిస్ ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పాండురంగచారి, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు అశోక్ శాక్య, చెన్నోజు శ్రీనివాసులు, కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహిదేవి నవరాత్రులు


వారాహి దేవి నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాల పీఠంలో గల ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో శ్రీ వారాహి దేవి నవరాత్రులు జూలై 6 నుంచి 14 వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆలయంలో వారాహి సమేత ప్రత్యంగిరా నవరాత్రుల కరపత్రాన్ని భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ ఉదయం విశేష అభిషేకం, మహిళలచే కుంకుమార్చన, సాయంత్రం లలితా, విష్ణు, సౌందర్యలహరి, హనుమాన్ చాలీసా పారాయణం, రాత్రి సమయంలో మహా నక్షత్ర హారతి నిర్వహిస్తామన్నారు. జూలై 10న సాయంత్రం లక్ష బిల్వార్చన, 12న లక్ష పుష్పార్చన జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 8977788066 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విట్టల్ శర్మ, సాయి కుమార్ శర్మ , అరుణ, హేమ, విజయలక్ష్మి, సుగుణ, భవాని, అవనిక పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎంపీలకు సన్మానం


మల్లు రవిని సత్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణకు చెందిన ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌రెడ్డి, కుందూరు రఘువీరారెడ్డిలను మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 47, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 60, కాకర 55, బీర 45, క్యాబేజీ 26, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 40, దొండ 19–23, చిక్కుడు 70, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలు 35, దోస 23, సొర 11, పొట్ల 28, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 35. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

20 ఏళ్ల కల నెరవేరుతున్న వేళ!

రేపు ప్రభుత్వ బధిరుల స్కూల్ భవనాన్ని ప్రారంభించనున్న మంత్రి సీతక్క


మలక్‌పేటలో నిర్మించిన ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల భవనం

చాదర్‌ఘాట్: 20 ఏళ్లుగా ఎదురు చూసిన కల నేడు నెరవేరుతున్నదని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు... మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనం ఆవరణలో రూ.1.20 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల భవన ప్రారంభోత్సవం ఈనెల 27న (గురువారం) జరగనుంది. ఇప్పటి వరకు బధిరుల పాఠశాల ఆస్మాన్‌ఘడ్‌లో అద్దె భవనంలో కొనసాగుతుండగా, వికలాంగుల సంక్షేమ భవనం ఆవరణలో అన్ని సౌకర్యాలతో కొత్త భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. విద్యార్థులకు భోజనంతో పాటు అధునాతన సౌకర్యాలతో ఆశ్రయం, విద్య సౌకర్యాలు కల్పించనున్నారు. దాదాపు 150 మంది మూగ విద్యార్థులు ఇక్కడ వసతి పొందనున్నారు. రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ బధిరుల పాఠశాల ఇదే కావడం విశేషం. కాగా, విద్యార్థులకు ఇక్కడ అధునాతనమైన సౌకర్యాలతో కార్పొరేటు దీటుగా విద్యానందించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఈనెల 27న మంత్రి సీతక్క ఈ భవనాన్ని ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.

కళ్లు జాగ్రత్త..!

- కొనసాగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు
- ఎగసిపడుతున్న దుమ్ము, ధూళీ
- కళ్లలో పడి వాహనదారుల అవస్థలు
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమంటున్న వైద్యులు


ఆటోనగర్ వద్ద ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారిపై వనస్థలిపురం, ఆటోనగర్‌ల వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా జాతీయ రహదారిపై ఇరువైపులా రోడ్లను తవ్వడంతో ఎక్కడికక్కడ మట్టి, ఇసుక పేరుకుపోయి వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేసి కళ్లల్లో పడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

- వానా కాలం కావడంతో వర్షం కురిసినప్పుడు రోడ్లపైకి మట్టి కొట్టుకొస్తోంది. అది ఆరిన తర్వాత దానిపై వాహనాలు వెళ్లినపుడు అతి సూక్ష్మమైన ఇసుక రేణువులు గాలిలోకి ఎగిసిపడి వాహనదారుల కళ్లలో పడుతున్నాయి. ఈ తరహా దుమ్ముతో కంటి తెల్లగుడ్డు ఎర్రబడుతోందని, డస్ట్, ఇసుక రేణువుల్లోని సిలికా అనే పదార్థం నల్లగుడ్డుపై ప్రభావం చూపుతోందని కంటి వైద్యులు పేర్కొంటున్నారు.
- అలాగే, రోడ్డుపై పారిన మురుగునీరు ఆరిపోయాక ఉత్పన్నమయ్యే దుమ్ముతో కంటికి ఇన్‌ఫెక్షన్ సోకుతోందని వైద్యులు చెప్తున్నారు. ఇన్‌ఫెక్షన్ పెరిగిపోయి కార్నియల్ అల్సర్, శ్వాసకోశ వ్యాధులు, కళ్లు ఎరుపెక్కడం, నీళ్లు కారడం వంటి రుగ్మతలు వస్తాయని, వీటిని నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదకరమని వైద్యులు చెపుతున్నారు. ఈ తరహా రుగ్మతలతో బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వారు చెబుతున్నారు. «చికిత్స కంటే నివారణ మేలు» అన్నట్టు నగర రోడ్లు విరజిమ్ముతున్న దుమ్ము, ధూళి నుంచి బయటపడేందుకు ముందు జాగ్రత్తలే మేలని వారు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి...

- రోడ్లపై ప్రయాణించాక ముందుగా చన్నీటితో మొఖం కడుక్కోవాలి.
- కంట్లో దుమ్ము పడ్డప్పుడు చేతులతో నలుపుకోకూడదు. వెంటనే నీటితో కడుక్కోవాలి.
- కన్ను ఎరుపెక్కితే అలక్ష్యం చేయకూడదు. చన్నీటితో కడుక్కుని లూబ్రికెంట్ డ్రాప్స్ వేసుకోవాలి.
- కళ్లు మండటం లేదా ఇన్‌ఫెక్షన్ ఇన్‌ఫెక్షన్ అయితే డీ–కంజెసెంట్ డ్రాప్స్ వేసుకోవాలి.
- బైక్‌పై ప్రయాణించేవారు హెల్మెట్ గ్లాస్‌ను వినియోగించాలి.

శుభ్రత ముఖ్యం..

- దుమ్ము,, ధూళీ వల్ల డస్ట్‌ఎలర్జీ, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. శుభ్రత, ముందు జాగ్రత్తలతోనే వీటిని నిరోధించవచ్చు.
- బయట తిరిగి ఇళ్లకు వెళ్లగానే స్నానం చేసి, దుస్తులు మార్చుకోవడం మంచిది. అదే దుస్తులతో ఉంటే ధూళికణాలతో ఇబ్బందులు ఎదురవుతాయి.
- రోడ్లపై వెదజల్లే దుమ్ములో కార్బన్, సిలికా, ఇతర త్రా మూలకాలు అధిక స్థాయిలో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనదారులు ముక్కుకు కర్చీఫ్ కట్టుకోవడం లేదా.. మాస్కులు ధరించడం ఉత్తమం.
- శ్వాసకోశాల్లో చేరే దుమ్మును తొలగించడం కష్టం. ఇది దుష్పరిణామాలకు దారితీసేలోపే.. యోగాలోని ప్రాణాయామం అలవాటు చేసుకోవడం మంచిది.
- కంటినొప్పి తీవ్రంగా ఉన్నా... కళ్లలోంచి నీళ్లు కారుతున్నా వైద్యుడిని సంప్రదించాలి.

అండర్‌పాస్ వద్దు.. ఫ్లైఓవర్ నిర్మించాలి


పనామా చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా పనామా చౌరస్తా వద్ద అండర్‌పాస్ నిర్మాణం వద్దని... ఫ్లైఓవర్ నిర్మించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పను లు చేపట్టవద్దంటూ పనామా చౌరస్తాలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ, దుర్గావిలాస్ నుంచి ఆటోనగర్ వరకు నిర్మించే అండర్ పాస్ రోడ్డుకు ఇరువైపులా ఎత్తైన ప్రహరీలు నిర్మించడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు వ్యాపార సంస్థల వారికి ఇబ్బందులు కలుగుతాయన్నారు. అండర్‌పాస్ నిర్మాణంతో మన్సూరాబాద్‌కు, సహారా రోడ్డుకు వెళ్లే కాలనీలకు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ మాత్రమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పనులు చేపడితే ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి కేంద్ర మంత్రుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్, నాయకులు రవీందర్‌గౌడ్, విజయ్‌కుమార్, కృష్ణంరాజు, మాధవి పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అధికారులను ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి నిధులు కూడా మంజూరు చేశామన్నారు. చైర్మన్ సాది అధ్యక్షతన మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ నిర్వహణ, బోనాలు, వినాయక చవితి పండుగలకు సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలకు పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం, వాటర్‌మెన్, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర వాటి కోసం మొత్తం రూ.64 లక్షల నిధులను కేటాయించారు.